క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కాకుమాను మండలానికి చెందిన 23 సంవత్సరాల యువతి గుంటూరులోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల చోరీపై ...

గుంటూరు ఈస్ట్: సెల్‌ఫోన్లు చోరీకి గురయిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఐపీడీ కాలనీలో నివసించే అరవ అయ్యప్ప శనివారం ఇంటి తలుపులు గడి వేయకుండా నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోని మూడు సెల్‌ఫోన్‌లు చోరీ చేశాడు. అయ్యప్ప ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో చోరీపై...

గుంటూరు ఈస్ట్: ఆటో చోరీకి గురైన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. లాలాపేటలో నివసించే షేక్ గౌస్‌బాషా, 14వ తేదీ ఆటోని ఇంటి ముందు నిలిపి అనంతరం నిద్రించాడు. ఉదయం లేచి చూసేటప్పటికి ఆటో కనిపించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటాడుతున్న ఆరుగురిపై ..

గుంటూరు ఈస్ట్: పేకాటాడుతున్న ఆరుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. భవానీపురంలోని ఓ ఇంట్లో కొందరు పేకాటాడుతున్నరన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.3,600 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

గుంటూరు మెడికల్: బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ బాజీ మూడోసారి ఎన్నిక అభినందనీయమని మోర్చా సీనియర్ నాయకుడు డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. షేక్ బాజీ మూడోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం అవ్వటంతో గుంటూరు జిల్లా మైనార్టీ నాయకులు ఆయన్ను ఆదివారం ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ప్రధాని నరేంద్రమోదీ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానని బాజీ ఈ సందర్భంగా వెల్లడించారు. పల్నాడు జిల్లా బీజేపీ మైనార్టీ అధ్యక్షుడు జిలాని, మేడికొండూరు మండల అధ్యక్షుడు షేక్ బాషా, మైనార్టీ మోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ షేక్ రఫీ తదితరులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): వివాహిత అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలిస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం మల్లువాయి గ్రామానికి చెందిన పుల్లా మురళికి పదహారు సంవత్సరాల కిందట సూర్యాపేటకు చెందిన సుజాతతో వివాహమయ్యింది. వీరికి పాప, ఒక బాబు సంతానం. రెండేళ్ల కిందట వీరిద్దరూ పిల్లలతో కలిసి కూలిపనుల నిమిత్తం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, చిన కొండ్రుపాడు గ్రామానికి వలస వచ్చారు. స్థానికంగా ఉన్న వెంకటరాజేష్ కోళ్ళ ఫారంలో పని చేసుకుంటూ, కంపెనీ క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న సుజాత ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని గమనించిన భర్త మురళి ఆమెని మందలించాడు. మర్నాడు ఉదయం సుజాత ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. అదే రోజు నుంచి అదే కోళ్ళ ఫారంలో పని చేస్తున్న ఒరిస్సాకు చెందిన వరుణ్ తండి అనే వ్యక్తి కూడా కనిపించకవడంతో పాటు అతని ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో వరుణే తన భార్య సుజాతని తీసుకొని వెళ్లి ఉండవచ్చని భర్త పుల్లా మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశమాంబకు ప్రత్యేక పూజలు

మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశమాంబ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రావణ మాసంలో అమ్మవారికి జరిగే ఉత్సవాల్లో మొదటి ఆదివారం జరిగిన పూజల కోసం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు అమ్మవారికి వివిధ అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. దేశమాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభయమానంగా తీర్చిదిద్దారు.

భాగవత కథామంజరి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సత్యనారాయణ తదితరులు

పాత గుంటూరు: డాక్టర్ మిక్కిలినేని రామకోటేశ్వరరావు రచించిన 'భాగవత కథామంజరి' పుస్తకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణ వేదికపై దేవస్థానం అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భారత ధార్మిక పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ పుస్తకావిష్కరణ చేశారు. పుస్తకం ప్రాధాన్యాన్ని వివరించారు. విశిష్ట అతిథులుగా ఆధ్యాత్మిక ప్రచారకులు డాక్టర్ కోగంటి శ్రీ రంగనాయకి, డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఏవీకే సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి, నూతలపాటి తిరుపతయ్య, వడ్లమూడి రాజ్యలక్ష్మి, చక్రపాణి, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

తాడేపల్లి రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అమ్మే వ్యక్తిని, కొనుగోలు చేసే వ్యక్తిని యస్ఐ రమేష్ ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. హైదరాబాద్ బండ్లగూడకు చెందిన మహమ్మద్ ఉస్మాన్ పాషా (ఆలీ) బతుకు తెరువు నిమిత్తం మంగళగిరి రూరల్ యర్రబాలెంలో నివాసముంటూ, మంగళగిరి పట్టణ పరిధిలో బేకరీ పని చేస్తున్నాడు. ఇతడికి తాడేపల్లి కొత్తూరుకు చెందిన శివయ్య మద్యం తాగే టప్పుడు పరిచయం అయ్యాడు. తాపీ పని చేసే శివయ్య వద్ద ఇటీవల డబ్బులు లేకపోవడంతో గంజాయికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే ఉస్మాన్ పాషాకు కూడా అలవాటు అయ్యింది. ఇటీవల అతడు యర్రబాలెంలోని స్నేహితుడు యాసిన్ వద్ద ద్విచక్ర వాహనం తీసుకువెళ్లి పాడేరు నుంచి గంజాయి కొనుగోలు చేసి తెచ్చి, శివయ్యకు ఇచ్చాడు. కృష్ణనగర్ శివారు ప్రాంతంలోని శ్మశానం వద్ద శివయ్య అమ్ముతుండగా సీఐ శేషగిరిరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా ద్విచక్ర వాహనంలో గంజాయితో పాటు శివయ్య దగ్గర చిన్న పొట్లాలు దొరికినట్లు యస్ఐ రమేష్ తెలిపారు. ఉస్మాన్ పాషా వద్ద గంజాయిని అమ్మేందుకు ఉపయోగించే కాటా లభించిందన్నారు. ఇద్దరి వద్దా 1200 గ్రాముల గంజాయి లభించడంతో వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం



పాత గుంటూరు: నగరంపాలెంలోని రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో సినీ నటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులురక్తదానం చేశారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో దాసరి అశోక్ చిన్ని, వి.సూరిబాబు, వెలిశెట్టి వెంకటేశ్వరరావు, నీలం చలమయ్య, పీసపాటి వెంకటేశ్వరరావు, బత్తిన వెంకటేశ్వరరావు, టీవీ. రావు, వంగ శ్రీనివాసరావు పాల్గొన్నారు. మేకల రవీంద్రబాబు పర్యవేక్షించారు.

వెంకటేశ్వర యోగి గురూజీకి అభినందనలు



వెంకటేశ్వర యోగి గురూజీని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ చిరంజీవి

మంగళగిరి: నగరానికి చెందిన శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పొందిన సందర్భంగా ఆదివారం నగరంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వెంకటేశ్వర యోగికి పీహెచ్‌డీ రావడం పెద్ద విశేషం కాదని, పద్మశ్రీ రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. అవసరమైతే ఇందుకు తన వంతు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని హామీనిచ్చారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ సమాజానికి విలువలు నేర్పిన వ్యక్తిత్వాన్ని భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా వెంకటేశ్వర యోగి జీవిత చరిత్రను సమాజానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. సత్కార గ్రహీత వెంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడుతూ నేడు ప్రపంచ ప్రజలందరినీ భాషలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు అతీతంగా ఏకం చేయగలిగినటువంటి ఏకైక విద్య యోగా విద్య మాత్రమే అన్నారు. ఇది తన పీహెచ్‌డీ ద్వారా ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సమర్పించిన గ్రంథ సారాంశమని వివరించారు. శరీరం ఆరోగ్యంగా, మనస్సు ప్రశాంతంగా, సంఘం శాంతిగా ఉండాలన్నా ఏకైక విద్య యోగా మాత్రమేనని పేర్కొన్నారు. అనంతరం శ్రీవెంకటేశ్వర యోగి గురూజీకి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించి మెమెంటోను బహూకరించారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్య మంద్రు శ్రీనివాసకుమార్, డాక్టర్ గోలి రామ్మోహనరావు, సీకే జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ మంచా విజయ మోహనరావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీతవిభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శ్రీ శుభాంజలి కళావేదిక వ్యవస్థాపకులు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రముఖ నటులు చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. కళావేదిక మహిళా కార్యదర్శి ధనలక్ష్మీ కుమారి, జ్యోతి ప్రజ్వలన చేసి విభావరిని ప్రారంభించారు. గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్, చీకటి రవికాంత్, మిరియాల ప్రసాదరావు, పాలపర్తి శ్రీనివాసరావు, మోహనరావు, డాక్టర్. సివిఎస్ రామకృష్ణ, అత్తోట సౌజన్య, రజని, టి. రామకృష్ణ పలు పాటలు మధురంగా ఆలపించారు. కార్యక్రమాన్ని వలి, గణేష్, బ్రహ్మం, బాలస్వామి పర్యవేక్షించారు.

సానుకూల దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రియా చౌదరి

తాడేపల్లి రూరల్: సానుకూల దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి సాధ్యమని, దాన్ని విద్యార్థులంతా అలవరచుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ప్రియా చౌదరి సూచించారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన మానసిక వికాస తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రత్యేకమైన లక్ష్యాల్ని ఏర్పరచుకుని తల్లిదండ్రులు ఆనందపడేలా జీవితంలో ఎదగాలని చెప్పారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె. రూతు రమ్య మాట్లాడుతూ కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి శివ కాంచనలత సహకారంతో విద్యార్థులకు మానసిక వికాసంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, కో- ఆర్డినేటర్ శివగంగ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, పూర్వ విద్యార్థుల అసిస్టెంట్ డైరెక్టర్, మహిళా అభివృద్ధి సెల్ కో- కన్వీనర్ డాక్టర్ కె.సోని, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఆర్.కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం ముప్పైమంది వృద్ధులు/ దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలి కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి సంజీవరరావు, గార్లపాటి రోశయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ (ఫైల్)

మంగళగిరి: యర్రబాలెం సినిమా హాల్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెం వేపచెట్టు సెంటర్‌కు చెందిన దానబోయిన నాగయ్య, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు అశోక్ (30) శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై మంగళగిరి నుంచి ఇంటిరి వస్తున్నాడు. మార్గంమధ్యలోని సినిమా హాల్ సెంటర్‌కు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీ గోడను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం ఉదయం అశోక్ మృతదేహాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య , పదేళ్ల కుమారుడు ఉన్నారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గుంటూరు నుంచి కర్నాటక వెళుతున్న ఆర్టీసీ బస్సు వేములూరిపాడు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఒకదాని కొకటి ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్, గోపి, మురళీలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని మరో వాహనంలో చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చల్లా కిశోర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎన్జీవో మహా సభల్ని జయప్రదం చేయండి

మంగళగిరి: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు ఉద్యోగులంతా హాజరై జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మంగళగిరి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, బాలనాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగబ్రహ్మం ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహాసభల్ని ప్రారంభించనున్నారని తెలిపారు.

చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలి



చేనేత నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

మంగళగిరి: చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించి, కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని చేనేత రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం చేనేత నాయకులు చిమ్మన నాగభూషణం, అందె నరసింహారావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు చేనేత సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చిమ్మన నాగభూషణం, అందె నరసింహారావు అనేక ఉద్యమాలు చేపట్టి తుది శ్వాస వరకు పోరాటం చేశారని కొనియాడారు. చేనేత సంఘాల నాయకులు వారిని ఆదర్శంగా తీసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తూరి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఎస్. బ్రహ్మేశ్వరరావు, డి. ఈశ్వరరావు, జె. జాన్‌బాబు, ఎ. ప్రభాకర్, జి. వెంకటకృష్ణ, బి. గిరి, ఆర్. అజయ్, జి. వెంకటేశ్వరరావు, ఎ. శ్రీనివాసమూర్తి, సీహెచ్. వెంకటేశ్వరరావు, వి. ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎన్. సుబ్రహ్మణ్యం, బి. నాగేంద్రం, జి. వెంకయ్య పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి



మంగళగిరి: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలోకి ఐటీ టెక్నాలజీని, 18 సంవత్సరాలకు ఓటు హక్కు , కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు నేరుగా నిధుల మంజూరు వంటి ఎన్నో వినూత్నమైన పథకాల్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం నాయకులు నగరపాలక సంస్థ కార్యాలయం, రాజీవ్ సెంటర్, భార్గవపేటలోని రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు కుప్పాకుల కృష్ణారావు, పఠాన్ సుభాని పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యత



పెన్షన్లు పంపిణీ చేస్తున్న సీఏ పిచ్చయ్య, శ్రీకాంత్, అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పులికొండ పిచ్చయ్య పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ - ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో పేదలకు నెలవారీ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పులికొండ పిచ్చయ్య మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు పెన్షన్లు పంపిణీ చేయడం ద్వారా అవోపా తన సామాజిక బాధ్యతను నెరవేరుస్తోందని అన్నారు. అవోపా జిల్లా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం 108 మంది పేదలకు రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శనగపల్లి నాగశ్రీకాంత్ పెన్షనర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసీసీఏ గుంటూరు చాప్టర్ చైర్మన్ మద్ది రవితేజ మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రతినెలా పెన్షన్లు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు, గుంటూరు అవోపా నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ గార్లపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీనియర్ రెసిడెంట్ భవన పర్యవేక్షణకు చర్యలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్



సీనియర్ రెసిడెంట్స్‌తో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సీనియర్ రెసిడెంట్ భవనాన్ని ఆదివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. పలువురు మహిళా వైద్యులు పలు సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందిని పెంచుతామని హామీ ఇచ్చారు. సీనియర్ రెసిడెంట్ వసతి గృహాన్ని పర్యవేక్షించేందుకు 2020 నుంచి ఎవరూ లేకపోవటాన్ని గుర్తించిన డాక్టర్ కిరణ్‌కుమార్ అనాటామీ విభాగాధిపతి డాక్టర్ సావిత్రిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తున్నట్లు తెలిపారు. కరెంట్ కోత లేకుండా జనరేటర్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించి ఏసీలు అమర్చుకునేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సూపరింటెండెంట్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజిని ఉన్నారు.

సేవ ప్రముఖులకు విశిష్ట పురస్కారాలు



రవీంద్రబాబుకు పురస్కారం అందించి సత్కరించిన కళావేదిక సభ్యులు

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో స్వరాలాపన సాంస్కృతిక సంగీత కళావేదిక ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సేవారంగంలో విశిష్ట సేవలందించిన సుశీల్ కుమార్, టి. సుధీర్, బత్తుల కోటేశ్వరరావు, మేకల రవీంద్రబాబుకు గాన గంధర్వుడు ఎస్‌పి. బాలు, జీవిత సాఫల్య పురస్కారం , కళా సేవారత్న బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ సుశీల్ కుమార్ సౌజన్యంతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు పలు చిత్రాల్లోని పాటలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమాన్ని కళావేదిక అధ్యక్షులు దేవరకొండ బాలస్వామి, ఉపాధ్యక్షులు కె.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి కె.బాబూరావు, పర్యవేక్షించారు.

'విజ్ఞాన్'లో చారిటీ భరతనాట్య నృత్య ప్రదర్శన



శ్రియ గుత్తాను, కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం చారిటీ భరతనాట్యం నృత్య ప్రదర్శన జరిగింది. అమెరికాలోని న్యూజెర్సీలో ఉన్న చాపిన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రియ గుత్తా నాట్య ప్రదర్శన ఇచ్చింది. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు నిధులను సేకరించాలనే ఉద్దేశంతో ఈ నృత్య ప్రదర్శనను నిర్వహించారు.దీని ద్వారా సేకరించిన నిధులను విజయవాడ గుణదలలోని విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ బ్లైండ్ స్కూల్‌కు విరాళంగా అందజేయనున్నారు. చిన్నారి శ్రియ గుత్తా తన 6వ ఏట నుంచే న్యూజెర్సీలోని బాలాదేవి చంద్రశేఖర్ వద్ద భరత నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. నృత్యం ద్వారా కథలను, భావోద్వేగాలను తెలియజేయగల సామర్థ్యమే కాకుండా గణితంలోనూ దిట్ట. నృత్యం, గణితంలో ఇతరులకు సాయం చేయడం, ఇతరుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపడం ద్వారా తాను ఎంతో సంతోషిస్తానని శ్రియ గుత్తా తెలియజేసింది. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ శ్రియ గుత్తా ప్రయాణం, అంకితభావం, అభిరుచి ఇతర విద్యార్థులకు, ప్రతిభావంతులకు స్ఫూర్తిదాయకమన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలనే సదుద్దేశంతో నృత్య ప్రదర్శనల ద్వారా ఫండ్ సంపాదించడం గొప్ప పరిణామమన్నారు. అనంతరం శ్రియ గుత్తాను, తల్లిదండ్రులు గుత్తా స్రవంతి, శ్రీగోపికాంత్‌లను ఘనంగా సన్మానించారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, యూనివర్శిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియా ఆల్మాస్ ప్రతిభ



మంగళగిరి: షార్జా యూఏఈ వేదికగా జరిగిన ఫస్ట్ ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా ఆల్మాస్ నాలుగు బంగారు పతకాలతో పాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ కైవసం చేసుకున్నట్లు కోచ్ ఎస్‌కే సంధానీ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించిన మొట్ట మొదటి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అని పేర్కొన్నారు. ఆమె కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతోందని చెప్పారు. ఈ సందర్భంగా సాదియా ఆల్మాస్‌కు సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, నేషనల్ పవర్ లిఫ్టర్ బి. ప్రసాద్, మంగళగిరి లిఫ్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి కొమ్మాకుల విజయ భాస్కరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

బహిరంగ సభ, బస్సు యాత్రను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అని నినదిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 17న విశాఖలో ప్రారంభమైన బస్సు యాత్ర 26న సాయంత్రం మంగళగిరి చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆటోనగర్ అల్ఫా హోటల్ సెంటర్ వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగే బస్సు యాత్రలో నాయకులు, కార్యకర్తలు, రైతులు, కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, తాడేపల్లి మండల కార్యదర్శి ముసునూరు సుహాస్, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, గుంటక సాంబిరెడ్డి, జి. శివ, షేక్ ఖాసిం, శీలం శ్యామ్ పాల్గొన్నారు.